క్లుప్తంగా

రోడ్లు ప్రారంభించిన మంత్రి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని జి.శివడ రోడ్డు నుంచి రాముడుగూడ వరకు నిర్మించిన రోడ్డు సహా రాముడుగూడ నుంచి కీడవాయి గ్రామానికి నిర్మించిన రోడ్డును మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం ప్రారంభించారు. రూ.90 లక్షల వ్యయంతో జి.శివడ-రాముడుగూడ రోడ్డు, మరో రూ.2 కోట్లతో రాముడుగూడ-కీడవాయి రోడ్డు నిర్మించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించి, పలు సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ, గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ భక్తుల ర్యాలీ

భామిని: మండల కేంద్రంలో క్రైస్తవ సోదరులు శుక్రవారం శిలువ మార్గం ర్యాలీ నిర్వహించారు. బత్తిలి, భామిని,నల్లరాయిగూడ చర్చిల పరిధిలోని క్రైస్తవులు ర్యాలీ చేపట్టి, కీర్తనలు ఆలపించారు. ఫాదర్లు భోగి సంజీవ్, ప్రతాప్ ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది.

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి

వీరఘట్టం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సీడీపీఓ సిమ్మాలమ్మ సూచించారు. మండలంలోని తెట్టంగిలో శుక్రవారం పౌష్టికాహార వారోత్సవాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ర్యాలీలో సూపర్‌వైజర్ జ్ఞానమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు ముందుండాలి..

సీతంపేట: మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలని ఎన్ఐఆర్‌డీ కన్సల్టెంట్ కె.నాగరాజు అన్నారు. సీతంపేట పంచాయతీ మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీగా ఎంపిక కావడంతో లైన్ డిపార్ట్‌మెంట్లకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా చేయాల్సిన కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా ఎన్ఐఆర్‌డీ కన్సల్టెంట్ కె.నాగరాజు మాట్లాడుతూ.. మహిళలు సామాజిక, రాజకీయ, ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.కళావతి, డీఎల్‌పీఓ రాంప్రసాద్, డీఎల్‌డీఓ గోపాలకృష్ణ, ఎంపీడీఓ కృష్ణారావు, ఈఓపీఆర్‌డీ సత్యం, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీ గడువు పెంపు

పాలకొండ: రాయితీపై ఆస్తి పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం గడువు పెంచిందని నగర పంచాయతీ కమిషనర్ జయరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం పన్ను కట్టేవారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే గతేడాదికి సంబంధించిన బకాయి పన్ను చెల్లించే వారికి వడ్డీపై 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. గతంలో మార్చి 31 వరకు ఉన్న అవకాశాన్ని తాజాగా ఏప్రిల్ 30 వరకు పొడిగించారని.. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేతనదారులకు పని..

పాలకొండ రూరల్: మండలంలోని ఎల్.ఎల్.పురం గ్రామానికి చెందిన పలువురు ఉపాధి వేతనదారులు తమ సమస్యలను సర్పంచ్ డి.సావిత్రమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్వారపూడి కుమార్‌లను గురువారం కలిసి విన్నవించిన సంగతి తెలిసిందే. ఈ విషయం సాక్షిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి 150 మంది వేతనదారులకు శుక్రవారం పనులు కల్పించారు. అలాగే పెండింగ్ వేతనాలను కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప జన్మదినం

వీరఘట్టం: అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను అయ్యప్ప స్వామి భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండలంలోని విక్రమపురంలో గల సన్నిధానంలో గురుస్వామి పొందూరు రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు మాచర్ల అనిల్‌బాబు, మాచర్ల శ్రీనివాసరావు, దివాకర్, సురేష్, అచ్యుతరావు, దుర్గారావు, శ్యామసుందరరావు పాల్గొన్నారు.

నిషేధిత వస్తువుల రవాణాపై దృష్టి

పాలకొండ రూరల్: నిషేధిత వస్తువుల రవాణాపై పోలీసులు దృష్టి సారించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పాలకొండ - వీరఘట్టం, విశాఖ, సీతంపేట రహదారుల్లో విజుబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సదరు వాహన చోదకుల డ్రైవింగ్ లైసెన్సులు, వాహన ధ్రువపత్రాలు పరిశీలించడంతో పాటు డ్రైవర్ల వివరాలు నమోదు చేసుకున్నారు. నిషేధిత వస్తువులు రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కె. ప్రయోగమూర్తి స్పష్టం చేశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

గరుగుబిల్లి: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు సూచించారు. మండలంలోని గొల్లవాని వలస గ్రామంలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణ లక్ష్యాలను చేరుకోవాలని అధికారులకు తెలిపారు.

వేసవిలో..
విద్యుత్‌ను ఆదా చేద్దామిలా..!

- బిల్లులు తగ్గించుకునేందుకు పొదుపు ఒక్కటే మార్గం
- పగటిపూట వాడకం తగ్గించాలి
- సూర్యరశ్మి ఇంటిలోకి వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి
- ఎల్‌ఈడీ బల్బులను వినియోగించాలి


పాలకొండ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది (ఫైల్)

పాలకొండ రూరల్:

వేసవిలో విద్యుత్‌ను ఆదా చేసేందుకు ఉన్న అన్ని రకాల అవకాశాలను అందిపుచ్చుకుని విద్యుత్ భారాన్ని తగ్గించుకోవచ్చు. ప్రస్తుతం ఏప్రిల్ నుంచే ఎండలు మండుతున్న నేపథ్యంలో అన్నివర్గాల వారు తమ స్థాయిని బట్టి వేడి నుంచి ఉపశమనం పొందే విద్యుత్ పరికరాల వాడకం పరిపాటిగా మారింది. వాస్తవానికి వేసవిలో విద్యుత్ వాడకం అధికంగా ఉంటుంది. గతంతో పోల్చుకుంటే కూటమి ప్రభుత్వంలో ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్ బిల్లుల మోత మోగుతోంది. ఈ తరుణంలో బిల్లుల భారం నుంచి కొంతమేర ఉపశమనం పొందేందుకు పొదుపు ఒక్కటే సరైన మార్గం. వీలైనంత వరకు పగటిపూట విద్యుత్ బల్బులు వాడకాన్ని తగ్గించుకోవడంతో పాటు సహజ వెలుగులో భాగంగా సూర్యరశ్మి ఇళ్లలోకి వచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవడం మేలు. దీని వల్ల విటమిన్ 'డి'తో పాటు స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించవచ్చు. అలాగే ఫిల్మెంట్ బల్బులకు బదులు 8 రెట్లు అధిక సామర్థ్యంతో పనిచేసిన ఎల్‌ఈడీలను వినియోగించడం మేలు. ట్యూబ్‌లైట్లుకు ఎల్రక్టానిక్ చోక్ అమర్చుకోవడం వల్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చు. అలాగే ఫ్యాన్లు వాడేటప్పుడు రెగ్యులేటర్లను ఏర్పాటు చేసుకోవాలి.

రిఫ్రిజిరేటర్ల వాడకంలో..
రిఫ్రిజిరేటర్ల వాడకంతో అధిక విద్యుత్ ఖర్చయ్యే ప్రమాదం ఉంది. దీనిని నివారించేందుకు ఫ్రిజ్ డోర్‌ను అధికంగా తెరవకూడదు. అలాగే ఫ్రిజ్ థర్మోస్టాట్ మధ్యస్థంగా ఉంచుకోవాలి. ఇళ్లలో ఫ్రిజ్‌లను వేడి అధికంగా ఉండే ప్రదేశాల్లో కాకుండా నీడ ప్రదేశంలో ఉంచడం వల్ల అవి త్వరితగతంగా చల్లబడి విద్యుత్ ఆదా అవుతుంది. అలాగే గోడలకు ఫ్రిజ్‌లను ఆనించి ఉంచరాదు.

ఎయిర్ కండీషనర్లు..
సామాన్యమైన చల్లదనానికి 26 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద ఎయిర్ కండీషనర్ వాడకంతో విద్యుత్ ఆదా అవుతుంది. ఒక్కో సెంటీగ్రేడ్ తగ్గించుకోవడం వలన 8 శాతం విద్యుత్ ఖర్చవుతుంది. ఏసీ ఫిల్టర్లను నెలకోమారు శుభ్రం చేసుకోవడం వల్ల కూడా విద్యుత్ ఖర్చు తగ్గించుకోవచ్చు. ఏసీపై లోడ్ తగ్గించుకోవడం కోసం ఇంట్లో చల్లదనం ఉండే పెయింట్లు వాడుకోవాలి.

వాషింగ్ మెషీన్లు, గ్రీజర్లు..
దుస్తులను శుభ్రం చేసుకునేందుకు విద్యుత్‌తో నడిచే వాషింగ్ మెషీన్ల వాడకం వల్ల కూడా అధిక విద్యుత్ బిల్లులు వచ్చే అవకాశం ఉంది. దీనిని తగ్గించుకునేందుకు మిషన్ టైమర్లను సక్రమంగా అనుసరించడం, ఎలక్ట్రిక్ డ్రయింగ్ ద్వారా కాకుండా మిషన్లో దుస్తులను ఉతికిన పిదప వాటిని తీసి ఆరుబయట ఎండలో ఆరవేసుకోవడం మేలు. సాయంత్రం 6 నుంచి 10 గంటల సమయంలో వాషింగ్ మెషీన్ల వాడకం తగ్గించుకోవాలి. అలాగే గ్రీజర్ల విషయంలో అవసరమున్నప్పుడు మాత్రమే వాడడం మంచిది. దీనికి కూడా థర్మోస్టాట్ 35 నుంచి 45 డిగ్రీల మధ్యలో ఉంచాలి. సాధ్యమైనంతవరకు ఈ తరహా పరికరాలకు సోలార్ సిస్టర్‌ను అమర్చుకోవడం మంచిది.

పరిశ్రమలు, వాణిజ్య సముదాయాల్లో..
పరిశ్రమల్లో పీక్‌లోడ్ అవర్స్‌లో (సాయత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు) విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు కారణంగా యంత్రాలు పాడయ్యే ప్రమాదం ఉంది. అలాగే విద్యుత్ కూడా అధికంగా ఖర్చవుతుంది. పవర్‌ఫెక్టర్ వీలైనంతవరకు 0.98 పైబడి ఉండేలా చూసుకోవాలి. నాన్ లీనియర్ లోడ్ అధికంగా ఉన్న పరిశ్రమల్లో హార్మోనిక్ ఫిల్టర్లను వాడుకోవాలి. స్టార్ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు వాడుకోవాలి. త్రీ ఫేజ్‌లో సమాన లోడు సర్దుబాటు చేయడం వల్ల విద్యుత్ ఆదా జరుగుతుంది. పంపుసెట్ల విషయంలో రైతులు కెపాసిటర్లను వాడుకోవాలి. సెక్షన్, డెలివరీల యందు మెలికలు లేని హెచ్‌డీపీఈ లేదా ఆర్‌పీవీసీ పైపులను వాడడం శ్రేయస్కరం. రాపిడి లేని ఫుట్‌వాల్వ్‌లు వాడడం ద్వారా విద్యుత్ ఆదా చేసుకోవచ్చు. ఈ విధంగా చేయడం వలన ప్రస్తుత సీజన్‌లో విద్యుత్ భారం నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉంటుందని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.

పొదుపు తప్పనిసరి..



విద్యుత్‌ను పొదుపుగా వాడడం మంచిది. వినియోగదారులు ప్రస్తుత వేసవిలో పొదపు చేయడం వల్ల ఆర్థికంగా లాభపడవచ్చు. పాలకొండ పరిధిలోని వినియోగదారులకు మా సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. వివిధ కేటగిరీలకు చెందిన 29 వేల పైచిలుకు విద్యుత్ కనెక్షన్ల ద్వారా నెలకు ఆరు మిలియన్ యూనిట్ల వినియోగం జరుగుతోంది. దీని వల్ల రూ.కోటీ 60 లక్షలు బిల్లుల రూపంలో వస్తుంది. కేవలం పొదుపు, జాగ్రత్తల వల్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చు.

– టీజీకే.మూర్తి, ఈఈ ఏపీఈపీడీసీఎల్, పాలకొండ

డీ పట్టా భూములు అప్పగించండి

- లివిరి గ్రామానికి చెందిన దళిత రైతులు


తహసీల్దార్ శివన్నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న దళిత రైతులు, సీపీఐ నాయకులు

భామిని: తమకు ప్రభుత్వం మంజూరు చేసిన 30 ఎకరాల డీ పట్టా భూములను వెంటనే అప్పగించాలని మండలంలోని లివిరికి చెందిన దళిత కుటుంబాలు కోరుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దళిత రైతుల ఆందోళనకు సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మద్దతు పలికారు. అనంతరం తహసీల్దార్ ఎస్. శివన్నారాయణ బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. 30 ఏళ్ల కిందట ప్రభుత్వం ఇచ్చిన భూములను వరప్రసాద్ అనే వ్యక్తి ఆక్రమించుకుని తోటలు సాగు చేస్తున్నాడని బాధితులు తెలిపారు. ఇటీవల చేపట్టిన భూ సర్వేలో తమ డీ పట్టా భూములను పరిగణనలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తహసీల్దార్ శివన్నారాయణ స్పందిస్తూ మండల సర్వేయర్, వీఆర్ఓల ఆధ్వర్యంలో సర్వే చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆందోళనలో లివిరి మాజీ సర్పంచ్ చెప్పల రాములు, దళిత నాయకులు పొట్నూరు జమ్మయ్య, ఎస్.నానాజీ, టెక్కలి మిన్నారావు, సీపీఐ జిల్లా నాయకుడు గుజ్జి జనార్దన, ఎ.అప్పలనాయుడు, మహిళా నేత చింతాడ అన్నపూర్ణమ్మ, దళిత రైతులు పాల్గొన్నారు.

ప్రకృతిసాగుకు ముందుకు రావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సింహాచలం

భామిని: సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు ప్రతి ఒక్కరూ ప్రకృతి సాగుకు ముందుకు రావాలని మండల వ్యవసాయాధికారి కె. సింహాచలం పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన కన్వర్జేషన్ సమావేశంలో రానున్న వ్యవసాయ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయం పెంపు ప్రణాళికపై వివరించారు. చిరుధాన్యాలు పండించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం మీసాల చక్రపాణి, ఐటీడీఏ ఎస్ఎఫ్ఏ మురలయ్య, వ్యవసాయ శాఖ సహాయకులు, వీఏఏలు, రైతు సమాఖ్య ప్రతినిధులు, ఏపీఎస్ఎఫ్ సిబ్బంది, వెలుగు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి


కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా మలాథియాన్ పిచికారీ చేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: ఆరోగ్యవంతమైన సమాజం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ బి.గౌరీశంకరరావు సూచించారు. మండల కేంద్రంలో వైద్యారోగ్య సిబ్బంది చేపట్టిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మురుగునీటి నిల్వలు ఉండకూడదని అవగాహన కల్పిస్తున్న సిబ్బందిని ఉద్దేశించి, ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్త సేకరణపై కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. అనవసరంగా ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా గ్రామస్తులను చైతన్యం చేయాలని కోరారు. ప్రజలు కూడా వైద్యారోగ్య, పారిశుధ్య సిబ్బందికి సహకరించాలన్నారు. అనంతరం మురుగుకాలువల్లో దోమలు పెరగకుండా నివారణ మందు పిచికారీ చేశారు.


పరామర్శ ..

సీతంపేట మండలంలోని కడగండివలసకు చెందిన పి.రజని అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం పరామర్శించారు. కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, చంద్రరావు, తదితరులున్నారు. – సీతంపేట


పోషణ్ పక్వాడ్‌పై అవగాహన

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్‌పై శుక్రవారం స్థానిక కార్యాలయంలో పొల్ల, కుసిమి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం ప్రాధాన్యత, రక్తహీనత నివారణా చర్యలపై వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ పి.రంగలక్ష్మి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. – సీతంపేట


త్వరితగతిన పల్లె పండుగ పనులు

మండలంలో జరుగుతున్న పల్లె పండుగ పనులు త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి పి.వీర్రాజు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా హౌసింగ్, ఐసీడీఎస్, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. వీరఘట్టం

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు, సభ్యులు

పాలకొండ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకుడు పీఎల్ రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఆ యూనియన్ ఆధ్వర్యంలో సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల హక్కుల కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎన్ఎంయూ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

గరుగుబిల్లి: స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు శుక్రవారం ప్రారంభించారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు అందుబాటులో ఉంచుతున్న ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ఇందుమతి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. అక్కడి నుంచి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2ను సందర్శించిన ఆయన.. గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం అందివ్వాలని, అలాగే ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందివ్వాలని సూచించారు.

అటవీ హక్కుల చట్టంపై అవగాహన


అటవీహక్కుల చట్టంపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

సీతంపేట: మండలంలోని నడిమి ద్వారబంధం గ్రామంలో గిరిజనులకు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో అటవీహక్కుల చట్టంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ నాగరాజు మాట్లాడుతూ.. వ్యక్తిగత హక్కుపత్రాలు, అటవీ చిల్లర ఫలసాయాలపై హక్కులు పొందాలన్నారు. ఇందుకోసం గిరిభూమి పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ ప్రతినిధులు ఎ.చిరంజీవరావు, ఎస్.రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెల్లి కులాలకు న్యాయం చేయండి

వీరఘట్టం: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయపరంగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని రెల్లి కులస్తులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని వీరఘట్టం పట్టణానికి చెందిన రెల్లి సామాజిక వర్గ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రెల్లి కులాలకు న్యాయం చేయాలంటూ వీరఘట్టం ప్రధాన రహదారిలో శుక్రవారం ర్యాలీ చేపట్టారు. సుమారు 500 మంది పాల్గొని నినాదాలు చేయడంతో పట్టణం దద్దరిల్లిపోయింది. మండల కేంద్రంలోని రెల్లివీధి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సుమారు కిలోమీటర్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు గ్రోమోర్ సెంటర్ వద్ద రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు.

మాట నిలబెట్టుకోవాలి..
జిల్లాను యూనిట్‌గా చేసుకుని వర్గీకరణ చేస్తామని గతంలో ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని రెల్లి కులస్తులు ప్రభుత్వాన్ని కోరారు. కులగణన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపమని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ చెల్లదంటూ 2024లో సుప్రీంకోర్టు తేల్చి చెప్పినా.. కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ర్యాలీలో రెల్లి సంఘ నాయకులు జలుమూరు అమర్‌నాథ్, బొమ్మాళి బాబూరావు, దన్నాన ప్రకాశరావు, రాయిపిల్లి సుదర్శనరావు, దేవుపల్లి ఆనంద్, సొండి అనిల్, దేవుపల్లి ముద్దు, కోల వరద, దేవుపల్లి చౌదరి, రాయిపల్లి జీవరత్నం, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై జి.కళాధర్ తమ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిన్నతరహా సాగునీటి వనరుల గణన చేపట్టాలి


వీఆర్‌వోలకు సూచనలిస్తున్న ఏఎస్‌వో చిన్నారావు

జియ్యమ్మవలస రూరల్: చిన్నతరహా సాగునీటి వనరుల గణన చేపట్టాలని ఏఎస్‌వో(సహాయ గణాంకాధికారి) కొల్లా చిన్నారావు సూచించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రెడ్డి పకీరు అధ్యక్షతన వీఆర్‌వోలతో శుక్రవారం సమావేశమయ్యారు. మండలంలోని 31 పంచాయతీలకు సంబంధించి సాగునీటి వనరులు, వాటి వివరాలను సేకరించాలని తెలిపారు. మైనర్ ఇరిగేషన్ ద్వారా ఎన్ని ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందో.. విద్యుత్ మోటార్ల ద్వారా రైతులు ఎన్ని ఎకరాల భూమిని సాగు చేస్తున్నారోనన్న వివరాలు సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు.

జ్వరాలపై అప్రమత్తం..


నులకజోడులో బాధితుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి

భామిని:

ప్రస్తుతం వివిధ రకాల జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి సూచించారు. మండలంలోని నులకజోడులో శుక్రవారం ఆమె పర్యటించి జ్వరాలు, కాళ్లు, చేతుల నొప్పులతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. జ్వరాలు ప్రబలడానికి గల కారణాలను గుర్తించి, వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బత్తిలి పీహెచ్‌సీని సందర్శించారు. కార్యక్రమంలో బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి దామోదరరావు, తదితరులున్నారు.

పక్కా ఇళ్లు మంజూరు చేయాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజన ప్రాంతాల్లోని నిరుపేదలైన ఎస్సీ, బీసీ, ఓసీలకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ఏజెన్సీ కాపు సంఘం అధ్యక్షుడు కొనిశ మన్మథ కోరారు. ఇదే విషయమై ఆయన కురుపాం మండలంలోని జి.శివడ రోడ్డులో శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్‌కు హాజరైన మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. పక్కా ఇళ్లు లేకపోవడంతో ఎంతోమంది అర్హులైన నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి పీఎం ఏవై పథకం కింద ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సాటేన రాజేష్, నితీష్, చారి తదతరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త పూలే

మానవతావాది, గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొని, పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. అంటరానితనం, కులవివక్షపై అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు పూలే అని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, స్త్రీ విద్యకు ఆయన తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.

-పాలకొండ రూరల్, సీతంపేట, గరుగుబిల్లి


గరుగుబిల్లి: మండల కేంద్రంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


సీతంపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సిబ్బంది


పాలకొండ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూలే గొప్పతనం వివరిస్తున్న ప్రిన్స్‌పాల్ శ్యాంబాబు